క్లుప్తంగా

విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు అందజేత



తిరువూరు: స్థానిక హర్ష కరాటే ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొంది బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. గిరిబాబు బ్లాక్ బెల్టులను శుక్రవారం ప్రదానం చేశారు. తిరువూరుకు చెందిన కొల్లిపర సూర్య విజయవైష్ణవి, సూర్యనారాయణ బద్రి ప్రభాస్, వీరవల్లి లక్ష్మీదీపక్, కంకట కార్తికేయలకు బ్లాక్ బెల్టులను సీఐ అందజేశారు. కరాటే ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు మోతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు



మైలవరం: మైలవరంలోని స్వర పాలిక్లినిక్ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. స్వర పాలిక్లినిక్ అధినేత సీహెచ్. రత్నకాంత్ ఎముకలు సాంద్రత పరీక్షలు నిర్వహించారు. పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం



చాట్రాయి: ఖరీఫ్ వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయనున్నారు. ఇందుకు గానూ వ్యవసాయ బోర్ల సదుపాయం ఉన్న రైతులు ముందుగా దమ్ము నార్లు పోసుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పొడి నార్లు కూడా పోస్తున్నారు. వరిసాగుకు పొలాలను పొడి దుక్కులు దున్నుకోవడం వల్ల భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో వర్షం కొద్దిగా ఆలస్యమైనా వరి నారుకు ఢోకా ఉండదని రైతులు చెబుతున్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందజేత



ఆగిరిపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నక్క హేమ నాగ త్రివేణిని ప్రధానోపాధ్యాయిని పుష్పలత అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన హేమ నాగ త్రివేణి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 582 మార్కులు సాధించినందుకు గానూ శుక్రవారం ఆమెను ప్రధానోపాధ్యాయిని పుష్పలత అభినందించి ప్రోత్సాహక బహుమతిగా రూ.28 వేలు నగదు, నూతన వస్త్రాలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ వేసవి శిబిరం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఇనిస్టిట్యూట్, శాప్ ఆధ్వర్యంలో గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కాలనీలో 45 రోజుల పాటు నిర్వహించిన ఫుట్‌బాల్ వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ప్రొడక్షన్ ఇంజినీర్ హనుమానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వేసవి శిబిరాల ద్వారా విద్యార్థుల్లో క్రీడాసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్యాంపు కోచ్ శ్రీమన్నారాయణరెడ్డి పర్యవేక్షణలో శిక్షణ పొందిన 38 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఎన్‌సీసీ క్యాంపులో బాలికలకు అస్వస్థత

ఇబ్రహీంపట్నం: కేతనకొండ సీబీఆర్ అకాడమీలో వారం రోజులుగా జరుగుతున్న 10వ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంపులో శుక్రవారం ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపులో ఎక్కువగా కొండపల్లి ఖిల్లాపై నిర్వహిస్తున్నారు. విశ్రాంతి లేకుండా నిర్వహించడం, ఎండ తాకిడికి బాలకలు శ్వాస కూడా తీసుకోలేక పోతున్నారు. శిబిరంలోని అధికారులు బాలికలను స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వంట.. బకాయిల తంటా

- వంట ఏజెన్సీలకు మూడు నెలలు బిల్లుల బకాయిలు
- అందని గౌరవ వేతనాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో నిర్వాహకులు
- పాఠశాలలు తెరవడంతో మరింత ఇబ్బందులు



కొండపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వంట ఏజెన్సీ కార్మికులు



ఇబ్రహీంపట్నం పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్న బాలికలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజనం పథకం వంట ఏజెన్సీ నిర్వాహకులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు నెలల బిల్లులతో పాటు మరో మూడు నెలల గౌరవేతనం ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల చొప్పున రూ.9 వేల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

సొంత డబ్బులతో వంటలు..

ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో మరలా మధ్యాహ్న భోజనం కోసం వంట ఏజెన్సీ నిర్వాహకులు సొంత డబ్బులు పెట్టుబడి పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రకరకాల మెనూలు పెట్టడంతో ఏజెన్సీలపై భారం పడుతోంది. పెరిగిన గ్యాస్, నిత్యావసరాల ధరలతో పెట్టుబడి లేక మండలంలోని ఐదు జిల్లా పరిషత్, 32 ఎంపీపీ పాఠశాలల్లోని సుమారు 70 మంది వంట ఏజెన్సీ కార్మికులు భోజన బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. సుమారు 800 మంది విద్యార్థులు ఉన్న జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును బట్టి భోజనం వండేందుకు నెలకు సుమారు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

మెనూ చార్జీలు పెంచాలి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని వంట ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు. ప్రస్తుతం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8.57, ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5.88లను ప్రభుత్వం అందిస్తోంది. వీటితో పాటు బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు సరఫరా చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర ధరలు, గ్యాస్, పుల్లలు, కూరగాయలను ఏజెన్సీ నిర్వాహకులు సొంత ఖర్చులతో సమకూర్చుకోవాల్సి వస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో ప్రభుత్వం ఇచ్చే మెనూ చార్జీ ఏమాత్రం సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల మెనూ చార్జీలను రూ.20కు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్లు ఇవి..

ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి. నూతన మెనూ అమలు చేయాలంటే వంట వర్కర్ల సంఖ్య పెంచాలి. 9, 10 తరగతులకు భోజనం వండిపెట్టే వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. ప్రతి నెలా ఐదో తేదీలోగా వేతనాలు చెల్లించి, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే అందించాలి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. అగ్ని ప్రమాదాలకు గురైతే నష్ట పరిహారం, ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలి. ఈఎస్ఐ సదుపాయం కల్పించాలి.

సకాలంలో బిల్లులు చెల్లించాలి

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీలు పెట్టిన పెట్టుబడి సకాలంలో చెల్లించక ఇబ్బందులు పడుతున్నారు. 700 మంది విద్యార్థులు ఉన్న జెడ్పీ పాఠశాలల్లో రోజుకు సుమారు రూ.5 వేలకు తగ్గకుండా ఖర్చు చేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పెట్టిన పెట్టుబడి బిల్లులతో పాటు గౌరవ వేతనం రూ.3 వేలు ప్రతి నెలా ఐదో తేదీలోగా చెల్లించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

మెనూ చార్జీలు రూ.20కు పెంచాలి



ప్రభుత్వ పాఠశాలల్లో వంట కార్మికులు విద్యార్థులను సొంత బిడ్డలుగా చూసుకుంటున్నారు. ప్రభుత్వం వారికి అరకొరగా రూ.3 వేలు గౌరవ వేతనం అందిస్తోంది. వారు పెట్టిన పెట్టుబడి బిల్లులు సక్రమంగా ఇవ్వడం లేదు. ప్రతి విద్యార్థికి మెనూ చార్జీ రూ.20కు పెంచాలి.

– ఎన్‌సీహెచ్ సుప్రజ, వంట ఏజెన్సీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బిల్లులు సకాలంలో చెల్లించాలి



పాఠశాలల్లో వంట ఏజెన్సీలు అప్పులు చేసి విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. పెట్టుబడి పెట్టిన బిల్లులను ప్రభుత్వం సకాలంలో చెల్లించడం లేదు. ప్రతి నెలా సకాలంలో బిల్లులు చెల్లించాలి. వారికి అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలి.

– ఎం.సోమేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు

సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తిరువూరు: జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాలరాసిన కూటమి ప్రభుత్వానికి సుప్రీం తీర్పు కనువిప్పు కావాలన్నారు. పత్రికా స్వేచ్ఛ ప్రాముఖ్యతను ఉన్నత న్యాయస్థానం చెప్పినందున ఇకనైనా మార్పు రావాలని సూచించారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా హక్కులను సుప్రీం కోర్టు తీర్పు తెలియజేస్తోందని, కూటమి ప్రభుత్వం ఈ తీర్పుద్వారా గుణపాఠం నేర్చుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ కాలనీ, కోనేరుపేట, వెలమపేట, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, తిరువూరు రోడ్డు, అన్నవరం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

● **భవానీపురం(విజయవాడపశ్చిమ):** విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖలీల్ భాయ్ రెస్టారెంట్, విజయవాడ కోల్డ్ స్టోరేజ్, నల్లగుంట, రసన కోల్డ్ స్టోరేజ్, శాంతినగర్, కల్పతరు ఫ్లాట్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, రాయనపాడు, పైడూరుపాడులో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

దళితులపై టీడీపీ నేత దాష్టీకం

- దళిత కాలనీ వద్ద ఆర్చ్ నిర్మాణానికి అడ్డంకులు
- కాలనీకి తన పేరే పెట్టాలని ఒత్తిడి

నాగులూరు(జి.కొండూరు): దళిత కాలనీకి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ నగర్‌గా పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు దళితులు సొంత ఖర్చుతో నిర్మించుకుంటున్న ఆర్చ్‌ని ఆపేందుకు తెర వెనక కుట్రలు పన్ని అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రెడ్డిగూడెం మండల పరిధి కొత్తనాగులూరు దళిత కాలనీ వాసులు తమ కాలనీకి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ నగర్ పేరుతో బోర్డును ఏర్పాటు చేసుకున్నారు.

ఇదే పేరుతో కాలనీకి ఆర్చ్‌ని నిర్మించుకునేందుకు సొంత నిధులు రూ.3 లక్షలతో ఇటీవల నిర్మాణ పనులను చేపట్టారు. కాలనీకి జగ్జీవన్‌రామ్ నగర్‌గా పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణ టీడీపీ నేత కాలనీకి తన పేరును పెట్టాలంటూ దళితులపై ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ టీడీపీ నేత మాటను వ్యతిరేకించిన దళితులు ఆర్చ్ నిర్మాణ పనులను కొనసాగించారు.



నిరసన తెలుపుతున్న దళితులు (ఫైల్)

అధికారులపై టీడీపీ నేత ఒత్తిడి

దీనిని తట్టుకోలేని టీడీపీ నేత పనులను అడ్డుకునేందుకు అధికారులపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా ఆర్చ్ నిర్మాణం చేస్తున్నారంటూ పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ ఈ నెల 11న స్థానిక తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దళిత నాయకులను రెడ్డిగూడెం పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. ఫిర్యాదు చేసిన పంచాయతీరాజ్ ఏఈ స్టేషన్‌కు రాకపోవడంతో మరోసారి స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని చెప్పి పంపారు. తమపై కేసులు పెట్టి వేధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని రోడ్డుపైకి వచ్చి కాలనీవాసులు నిరసన తెలిపారు.

రైతులు బయోమెట్రిక్ వేయాలి

తిరువూరు: అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకాల ద్వారా నగదు పొందడానికి రైతులు తమ బయోమెట్రిక్ వేయాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ కోరారు. సమీప రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతులు బయోమెట్రిక్ వేస్తేనే ఈ పథకాల ద్వారా నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. అర్హుల జాబితాలో పేరు ఉన్న వారు ఈ నెల 20 లోగా బయోమెట్రిక్ పూర్తిచేయాలన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఎస్ఈ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ మీటర్ల విస్తృత తనిఖీ శుక్రవారం నిర్వహించారు. 46 మంది అధికారులు, 189 మంది సిబ్బంది 46 బృందాలుగా ఏర్పడి 4,682 సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 486 మందికి రూ.8.06 లక్షల అపరాధ రుసుం విధించారు. విజిలెన్స్ విభాగం ఈఈ విజయకుమారి, డీఈలు గురు కిశోర్, సుధాకర్, స్టాలిన్‌కుమార్, శ్రీనివాసరావు, ఏఈ కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు. రూరల్ డివిజన్ ఆపరేషన్ విభాగం ఎస్ఈ వసంత రావు పర్యవేక్షించారు.

నేడు ఖిల్లాపై యోగాంధ్ర కార్యక్రమం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొండపల్లి ఖిల్లాపై యోగా అభ్యసన కార్యక్రమం శనివారం ఉదయం ఆరు గంటలకు నిర్వహిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ప్రతినిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ముకేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని చెప్పారు.

16న అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

ముసునూరు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం మండల నాయకులు తెలిపారు. తమ సమస్యలపై తహసీల్దార్ కేవీ రమణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

పని గంటల పెంపును నిరసిస్తూ ధర్నా

నూజివీడు: రాష్ట్రంలోని అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారం చేపట్టిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి.రాజు ధ్వజమెత్తారు. కార్మికుల పని గంటలను ఎనిమిది గంటల నుంచి పది గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందన్నారు. దీనిలో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న పని గంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కార్మికులను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు అందరికీ అందించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్లు, నాయకులు రంగారావు, ప్రసాదు, రామారావు, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, చంద్రశేఖర్, సంసోను, రజని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

పనిగంటల పెంపును విరమించాలి

ఇబ్రహీంపట్నం: అసంఘటిత రంగ కార్మికుల పని గంటలు పెంచేలా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పనిగంటల పెంపు, రాత్రి వేళల్లో మహిళలు పని చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో వివిధ ట్రేడ్ యూనియన్‌ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కుల హరించే లేబర్ కోడ్స్ రద్దు కోసం జులై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యక్షుడు కొండలరావు, వివిధ ట్రేడ్ యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

తల్లికి వందనంలో కోతలెందుకు?

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

తిరువూరు: అర్హులందరికీ తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం రకరకాల ఆంక్షలతో పథకాన్ని నీరుగారుస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ విమర్శించారు. తిరువూరు సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కుటుంబాలకు తల్లికి వందనం నిలిపి వేయడం దారుణమన్నారు. నెలకు రూ.12 వేల ఆదాయంతో కుటుంబం గడవడమే కష్టంగా ఉంటే అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలు చదువుకునేందుకు తల్లికి వందనం కింద ఆర్థిక సాయం చేయకపోవడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిబంధన సడలించకపోతే ఈ నెల 16న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహిస్తామన్నారు. జులై 9న జరిగే కార్మికుల దేశవ్యాప్త సమ్మెలో కూడా కార్మికులంతా పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుప్రజ, తిరువూరు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, ఆకుల రవి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

వైఎస్సార్ సీపీ నేత చిన్నయ్య మృతి

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లమోతు చిన్నయ్య (58) శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. చిన్నయ్య బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు స్వయాన మేనమామ. ఈయన భార్య నల్లమోతు కస్తూరి ఎంపీటీసీగా, పంచాయతీ వార్డు మెంబర్‌గా సేవలు అందించారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్, రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, మేడపాటి నాగిరెడ్డి, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, పలువురు వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ, కూటమి నాయకులు చిన్నయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



చిన్నయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న జోగి రమేష్ తదితరులు

విద్యార్థులకు కిట్స్ పంపిణీ

మైలవరం: మైలవరం మండలం చంద్రాల మోడల్ ప్రైమరీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి, గంగాధర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లిలోని అలిగినేని పెదముత్తయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, ఎస్ఎంసీ సభ్యుడు ప్రమోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను హెచ్ఎం శారద ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్ బావిశెట్టి వీరరాఘవయ్య అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు

ది విశాఖ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం

నూజివీడు: ప్రభుత్వాలు అనవసరంగా జోక్యం చేసుకోవడం వల్లే కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు దెబ్బతింటున్నాయని ది విశాఖ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పూర్వపు చైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. నూజివీడులో ది విశాఖ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బ్రాంచిని శుక్రవారం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే కో–ఆపరేటివ్ బ్యాంకుల పటిష్టం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశాఖ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, కృష్ణా పాల సమితి చైర్మన్ చలసాని ఆంజనేయులు, వివిధ కో–ఆపరేటివ్ బ్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఉపాధి హామీ సభలు

తిరువూరురూరల్: మండలంలోని రెండు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సభలను శుక్రవారం నిర్వహించారు. ఆంజనేయపురంలో సర్పంచి మామిడి కుటుంబరావు అధ్యక్షతన జరిగిన సభలో ఏపీవో మున్నీ, డీఆర్పీ వెంకటేష్, ఉపాధి ఫీల్డ్ సిబ్బంది, జాబ్‌కార్డు దారులు పాల్గొన్నారు. చిట్టేలలో సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఉపాధిహామీ సభ నిర్వహించారు.

నేడు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉదయం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

దాసాంజనేయుడికి లక్ష మల్లెలతో అర్చన

తిరువూరు: స్థానిక పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు మరింగంటి పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు చేసిన అనంతరం భక్తులు సమర్పించిన మల్లెలతో అర్చన జరిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

జి.కొండూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అందరి లక్ష్యం కావాలని డెమోక్రాటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి. శ్రీను అన్నారు. మన బాట.. బడిబాట అనే నినాదంతో శుక్రవారం జి.కొండూరులోని బీసీ కాలనీ ఏరియాలో తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని జి.కొండూరు మండల శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, జి.కొండూరు మండల శాఖ కార్యదర్శి డి. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో రూ. లక్ష జరిమానా

మైలవరం: రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట లంబాడీ తండాకు చెందిన బానోతు పవన్‌కుమార్ అనధికారికంగా మద్యం సీసాలు కలిగి ఉండటం వంటి నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో నిందితునికి తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జె. సుశీలాదేవి రూ. లక్ష జరిమానా విధించారు. గ్రామంలో మద్యం అమ్మకాలు, అనుమతి లేని లిక్కర్ సీసాలు కలిగి ఉండటం నేరమని, ఇలాంటి వారిపై కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.